సాక్షి
నిజామాబాద్
బుధవారం : 22 : మే : 2024



నిధులు రాక పనులకు బ్రేక్

నిధులు విడుదల కాకపోవడంతో జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

- 8లో ▸



రుణలక్ష్యం రూ.1,032 కోట్లు

బ్యాంక్ లింకేజీ రుణలక్ష్యం పూర్తి చేయడానికి సమష్టిగా పనిచేయాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.8 /28.5

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వడ గాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.


కీలక పదవులపై దృష్టి





రాష్ట్ర స్థాయిలో కీలక పదవుల కోసం జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో ప్రతిఒక్కరూ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో గత డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాకు చెందిన కీలక నాయకులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు.

- పీసీసీ పీఠం, కేబినెట్ బెర్త్‌ల కోసం..
- జిల్లా నుంచి పోటీపడుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- పీసీసీ పీఠంపై మహేశ్‌గౌడ్ గురి.. తప్పితే బీసీ కోటాలో కేబినెట్ బెర్త్
- మొదటి నుంచి మంత్రి పదవి రేసులో సుదర్శన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి జిల్లా నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నలుగురు ఎమ్మెల్యేలను గెలుచుకుంది. నలుగురిలో సీనియర్ అయిన బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి కేబినెట్ బెర్త్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకే చెందిన సీనియర్ నేత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ (ఆర్గనైజింగ్ వ్యవహారాలు) బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మహేశ్‌కుమార్ గౌడ్ శాసనసభ ఎన్నికల ముందు నుంచే పీసీసీ పీఠంపై కన్నేశారు. పార్టీకి సంబంధించి అన్నిరకాల ఆర్గనైజింగ్ వ్యవహారాలను నిర్వహించడంలో తనదైన పాత్రతో ఏఐసీసీ నాయకత్వం వద్ద మంచి పేరు సంపాదించుకున్నారు. అదేవిధంగా అధినాయకత్వం వద్ద మహేశ్‌గౌడ్‌కు మంచి సాన్నిహిత్యం కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే అధినాయకత్వం ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. సరిగ్గా ఇక్కడే వ్యవహారం మలుపు తిరిగింది. బీసీ కోటాలో మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం ఇచ్చే అవకాశం లేకపోతే, కేబినెట్ బెర్త్ అయినా కేటాయిస్తారనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

మారిన సమీకరణాలు..

మొదటి విడతలో మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. ఈ క్రమంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల కోసం సుదర్శన్‌రెడ్డిని పార్టీ నాయకత్వం ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో గెలుపు కోసం బీజేపీతో హోరాహోరీ తలపడ్డారు. మంత్రి పదవి కోసం రేసులో ముందంజలో ఉన్న సుదర్శన్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల విషయమై పెద్ద టాస్క్ అప్పగించడంతో ఉత్కంఠ నెలకొంది. లోక్‌సభ స్థానంలో తాటిపర్తి జీవన్ రెడ్డి గెలుస్తారా లేదా అనే విషయమై పక్కన పెడితే ఆయా శాసనసభ సెగ్మెంట్లలో సాధించే ఆధిక్యం మీద పార్టీ నాయకత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నిజామాబాద్ రూరల్, బోధన్ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో ఈ రెండు స్థానాల్లో వచ్చే ఆధిక్యం విషయమై పార్టీ శ్రేణుల్లో గుబులు నెలకొంది. ఎన్నికల ఫలితం, ఈ సెగ్మెంట్లలో సాధించే ఆధిక్యం సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ కోటాలో మంత్రి పదవి ఇస్తే ఏవిధంగా ఉంటుందనే విషయమై పార్టీ నాయకత్వం పరిశీలన చేస్తోంది. ఈ క్రమంలో పీసీసీ పీఠం రేసులో ఉన్న ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కేబినెట్ బెర్త్ రేసులోకీ వచ్చారు. ఒకవేళ సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి కేటాయిస్తే మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కుతుందా అనే విషయమై సైతం ఉత్కంఠ నెలకొంది. కాగా మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇలా అయితే మహేశ్‌గౌడ్‌కు పీసీసీ పీఠం, సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ వస్తాయనే చర్చ సాగుతోంది. మొత్తంమీద సుదర్శన్‌రెడ్డి మంత్రి పదవి రేసులో ఉండగా, మహేశ్‌గౌడ్ మాత్రం బీసీ కోటాలో కేబినెట్, పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉండడం గమనార్హం.

చివరి గింజ వరకు కొంటాం



ఇందల్వాయిలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్

- జిల్లాలో 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్

ఇందల్వాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్ అన్నారు. ఇందల్వాయిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులను పలకరించి, ధాన్యం సేకరణ తీరుపై ఆరా తీశారు. మూడు రోజులుగా ధాన్యం తూకం వేయడం లేదని ఓ రైతు ఆయన దృష్టికి తీసుకురాగా నిర్వాహకులపై ప్రత్యేక అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. ఇంకా సుమారు 5,500 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రస్తుతం కొనసాగుతున్న 25 కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతాలైన పడిగెల్, డొంకేశ్వర్ వంటి చోట్ల వరినాట్లు ఆలస్యమైనందున దిగుబడులు కొంత ఆలస్యంగా వస్తున్నాయని తెలిపారు. అలాంటి ప్రాంతాలను మినహాయిస్తూ మిగతా చోట్ల రెండుమూడు రోజుల్లో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తెచ్చారు. డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నిజామాబాద్‌రూరల్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 29, 30 తేదీల్లో జరుగుతాయని సీఈవో ఉష ఒక ప్రకటనలో తెలిపారు. 29న 11 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమంపై సమావేశం జరుగుతుందన్నారు. 30న ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమం, పనులు, ఆర్థిక ప్రణాళికలపై సమావేశాలు ఉంటాయని వివరించారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

న్యూస్‌రీల్

తెయూ ఇన్‌చార్జి వీసీగా సందీప్ సుల్తానియా



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ సుల్తానియాను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నియమించింది. గతంలో తెయూ వీసీ గా పని చేసిన ప్రొఫెసర్ రవీందర్‌గుప్తా గత ఏడాది జూన్‌లో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ విషయం తెలిసిందే. అనంతరం తెయూ ఇన్‌చార్జి వీసీగా సీనియర్ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, బుర్రా వెంకటేషం పని చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు 2021 మే 21న అప్పటి ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియమించింది. 2024 మే 21 తో వారి పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, కొత్త వీసీల నియామక ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం 10 యూనివర్సిటీలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమించింది. తెయూ ఇన్‌చార్జి వీసీగా నియామకమైన సందీప్‌కుమార్ సుల్తానియా రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. నెలాఖరులోగా ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియమించే అవకాశం ఉంది.

సమన్వయంతో పని చేయాలి



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: మున్సిపల్ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ సూచించారు. 'మున్సిపల్ చట్టానికి తూట్లు' శీర్షికన సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ మకరందు స్పందించారు. అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌తో ఫోన్‌లో మాట్లాడి బిల్ కలెక్టర్‌లు, డిప్యూటీ కమిషనర్‌తో సమీక్షించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్(డీసీ) రాజేంద్రకుమార్, బిల్‌కలెక్టర్లతో సమీక్షించారు. ఆస్తి పన్ను వసూళ్ల విషయంలోనే ఒత్తిడి చేసినట్లు డీసీ ఆయన దృష్టికి తీసుకవచ్చారు. శాఖకు ఆదాయం పెంచేందుకు కమిషనర్ ఆదేశాల మేరకు పని చేశామన్నారు. బిల్ కలెక్టర్లు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ కోరారు. ఉదయం 7 గంటలకే విధులకు రావాలని డిప్యూటీ కమిషనర్ ఒత్తిడి చేయడం సరికాదని బిల్ కలెక్టర్లు అన్నారు. తమకు సమస్యలు ఉంటాయని, అర్థం చేసుకోకుండా తిడుతున్నారని వారు అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని బిల్ కలెక్టర్‌లకు అసిస్టెంట్ కమిషనర్ హామీ ఇచ్చారు.

నిలకడగా భూగర్భ జలాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. మార్చి నెలతో పోలిస్తే ఏప్రిల్‌లో భూగర్భ జలాలు పెద్దగా తగ్గుముఖం పట్టలేదు. అయితే అకాల వర్షాలు ఇందుకు దోహదపడ్డాయని చెప్పవచ్చు. పలు ప్రాంతాల్లో కొంతమేర జలాలు పైకొచ్చాయి. భూగర్భజల శాఖ ఏప్రిల్ నెలకు సంబంధించి ఫీజో మీటర్ల వారీగా నీటి మట్టాల గణాంకాలను విడుదల చేసింది. మార్చిలో జిల్లా వ్యాప్తంగా 12.30 మీటర్ల లోతులో ఉన్న జలాలు, ఏప్రిల్‌లో 12.33 మీటర్ల వద్ద ఉన్నాయి. 0.04 మీటర్ల వ్యత్యాసం మాత్రమే కనిపిస్తోంది. జిల్లాలో 82 ఫీజో మీటర్లు ఉండగా, పదిహేను ఫీజో మీటర్లలో ఒక మీటరు వరకు జలాలు పెరిగాయి. పంట పొలాల కోతలు పూర్తి కావడంతో వ్యవసాయ బోర్ల వాడకం కూడా తగ్గింది. అక్కడక్కడా బోర్లు రీచార్జి అవుతున్నాయి. వర్షాకాలం మొదలయ్యే వరకు నీటిని పొదుపుగానే వాడుకోవాలని భూగర్భజల శాఖ అధికారి శ్రీనివాస్ బాబు ప్రజలకు సూచించారు.

గ్రామ పంచాయతీల సందర్శన

పిట్లం: రాంపూర్, కిష్టాపూర్, పిట్లం, పోతిరెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్ గ్రామ పంచాయతీలను మంగళవారం పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ సందర్శించారు. ఆయా పంచాయతీల పరిధిలోని కంపోస్ట్ షెడ్‌లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, ఉపాధి హామీ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్, పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి





మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవికుమార్, హాజరైన అధ్యాపకులు

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ సప్లిమెంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ ఆదేశించారు. ఈ నెల 24న ప్రారంభమయ్యే పరీక్షలపై మంగళవారం ఆయన ఖిల్లా జూనియర్ కళాశాలలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 18,288 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష పూర్తయ్యేంత వరకు మూసి ఉంచాలని ఆదేశించారు. కేంద్రాల్లో ఆశవర్కర్ల ఆధ్వర్యంలో మెడికల్ సర్వీస్‌లను ఏర్పాటు చేశామన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదన్నారు. ఉద్యోగులు పరీక్షల్లో తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాని కోరారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.8 లక్షల నగదు, కారు, ఇతర వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధుశర్మ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధు శర్మ



స్వాధీనం చేసుకున్న నగదు

కామారెడ్డి క్రైం: సిగరెట్ కంపెనీలకు సంబంధించిన ఏజెన్సీలను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. మంగళవారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 15 రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్ ప్రాంతంలో ఉన్న ఓ సిగరెట్ కంపెనీ ఏజెన్సీలో దొంగతనం జరిగింది. సుమారు రూ.10 లక్షల విలువైన సిగరెట్ కార్టన్ బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు.. రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం, సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లాకు చెందిన కుమావత్ బుందారాం, కుమావత్ లక్ష్మణ్‌రాం, కుమావత్ ఘన్‌శ్యామ్‌లుగా గుర్తించారు. మంగళవారం సిరిసిల్ల రోడ్డులోని ఓ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బుందారాం, లక్ష్మణ్‌రాం పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడైన ఘన్‌శ్యాం పరారీలో ఉన్నాడన్నారు. నిందితులు కామారెడ్డితో పాటు నకిరేకల్, మహబుబ్‌నగర్, ఆమంగల్, వనపర్తి టౌన్, వనపర్తి రూరల్, వరంగల్‌తోపాటు కర్ణాటకలోని హుమ్నాబాద్ పీఎస్‌ల పరిధిలో మొత్తం 8 చోరీలకు పాల్పడ్డారన్నారు. వీరు చోరీ చేసిన సొత్తు విలువ రూ.50 లక్షలకుపైగా ఉంటుందని పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని, లక్ష్మణ్‌రాం బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.7.50 లక్షలను సీజ్ చేశామని తెలిపారు. నిందితుల వద్దనుంచి ఓ స్విఫ్ట్ కారు, మూడు సెల్‌ఫోన్లు, చోరీలకు ఉపయోగించిన గడ్డపార, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పట్టణ, సీసీఎస్ సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, ఎస్సైలు ఉస్మాన్, మహేందర్ రెడ్డి, సిబ్బంది సయ్యద్, కిషన్, సురేందర్, గణపతి, రాజేందర్, శ్రావణ్, నరేష్, కరుణాకర్, విశ్వనాథ్, రాజు, విఠల్, నరేశ్‌లను ఎస్పీ అభినందించారు.

నాలుగేళ్ల తర్వాత మల్లన్న దర్శనం

- ఎస్సారెస్పీలో నీరు తగ్గడంతో ముంపు నుంచి బయటపడిన ఆలయం
- నిత్యం తరలివస్తున్న భక్తులు



మల్లన్న గుట్టకు వస్తున్న భక్తులు



ప్రాజెక్ట్‌లో కొండపై మల్లన్న ఆలయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన రత్నాపూర్ గ్రామ ఆరాధ్య దైవం మల్లన్న భక్తులకు దర్శనమిస్తున్నాడు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 10 టీఎంసీలకు పడిపోవడంతో ఆలయం వద్దకు వెళ్లడానికి దారి ఏర్పడింది. దీంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 91 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అందులో రత్నాపూర్ గ్రామం ఒకటి. ప్రస్తుతం రత్నాపూర్ గ్రామం జగిత్యాల జిల్లాలో పునరావాస గ్రామంగా ఏర్పడింది. గ్రామస్తుల కొంగు బంగారంగా ఉన్న మల్లన్న ఆలయాన్ని అక్కడ కూడా నిర్మించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఆలయం బయట పడటంతో రత్నాపూర్ గ్రామం నుంచి భక్తులు తరలి వచ్చి పూజలు చేస్తున్నారు.

చెక్కు చెదరలేదు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన మల్లన్న గుట్టపై నిర్మించిన ఆలయం చెక్కు చెదరలేదు. ప్రాజెక్ట్ నిండిన సమయంలో ఆలయం వరకు నీరు వెళ్లదు. కానీ ఆలయం గల గుట్ట ముంపునకు గురవుతుంది. 2019లో నీరు తగ్గడంతో ఆలయం బయట పడింది. మళ్లీ ఇప్పుడు నీటిమట్టం పడిపోవడంతో ఆలయానికి భక్తులు తరలివెళ్తున్నారు. అయితే పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఆలయం వరకు రోప్ వంతెన నిర్మిస్తామని గత ప్రభుత్వంలో పాలకులు ప్రకటించారు. కానీ ఇప్పటికి అది అమలుకు నోచుకోలేదు. ప్రాజెక్ట్ మధ్యలో గల మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇలా చేరుకోవాలి..

నిజామాబాద్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో రత్నాపూర్ మల్లన్న ఆలయం ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్, బాల్కొండ మీదుగా పాత జాతీయ రహదారి 44పై వచ్చి బస్సాపూర్ గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం మీదుగా మల్లన్న గుట్టకు చేరుకోవచ్చు. గుట్ట వరకు వాహనాలు వెళ్తాయి.



ఆలయంలోని విగ్రహాలు

మా ఇంటి దేవుడు



మల్లన్న మా ఇంటి దైవం కావడంతో ఇక్కడి వరకు వచ్చి పూజలు నిర్వహిస్తున్నాం. ప్రాజెక్ట్‌లో అన్ని పోగొట్టుకున్నాం. మల్లన్న దేవుడిని మళ్లీ పునరావాస గ్రామంలో కూడా నెలకొల్పుకున్నాం. – మల్లయ్య, భక్తుడు

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



నాలుగేళ్ల తరువాత ఆలయం బయట పడింది. దీంతో మల్లన్నకు పూజలు చేయడానికి వచ్చాం. మల్లన్న కోరికలు తీర్చే దైవంగా ప్రసిద్ధి. ప్రభుత్వం పట్టించుకుని ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. – భూమేశ్, భక్తుడు

రాయితీల కోసం నిరీక్షణ

- సాంకేతిక కారణాలతో గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీకి పలువురు దూరం
- ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తులు స్వీకరించని అధికారులు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటే తిప్పలు
- ఆందోళనలో ఆశావహులు




మోర్తాడ్(బాల్కొండ): ఆరు గ్యారెంటీల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియకు ముందే పలు పథకాలను అమలు చేసినా సాంకేతిక కారణాల వల్ల కొంత మందికే లబ్ధి చేకూరింది. ఇప్పటి వరకు గృహజ్యోతి, గ్యాస్ రాయితీ పొందనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తులను స్వీకరించడానికి అధికారులు ముందుకు రావడం లేదు. జిల్లాలో 6.33 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, ఇందులో 4.02 లక్షల మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు 1.58లక్షల మందికి మాత్రమే గ్యాస్ రాయితీ మంజూరైంది. మరో 2.44లక్షల మందికి రాయితీ అందాల్సి ఉంది. గృహజ్యోతి కింద 3.90లక్షల మంది వినియోగదారులు అర్హులని విద్యుత్ శాఖ అధికారులు లెక్క తీశారు. 2.37లక్షల మంది వినియోగదారులకు మాత్రమే జీరో బిల్లులు అందుతున్నాయి. మిగిలిన వారికి జీరో విద్యుత్ బిల్లులు అందాలంటే దరఖాస్తులను మరోసారి పరిశీలించాల్సి ఉంది. ఎలక్షన్ కోడ్ కారణంగా సంక్షేమ పథకాలు అందించడంలో జాప్యం ఏర్పడిందని ప్రభుత్వం చెబుతున్నా.. పోలింగ్ ప్రక్రియ ముగిసిపోవడంతో రాయితీ పథకాలపై పునః సమీక్ష చేసి ఎన్నికల కమిషన్ అనుమతితో అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

అందని 'మహాలక్ష్మి'

మహాలక్ష్మి పథకం కింద ప్రతి గృహిణి బ్యాంకు ఖాతాలో రూ.2,500 చొప్పున జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు దరఖాస్తుల స్వీకరణే తప్ప ఒక్కరికీ సాయం అందించలేదు. ఆసరా పింఛన్లు పొందని వారు మహాలక్ష్మి పథకం కింద అర్హత సాధిస్తామనే ధీమాతో ఉన్నారు.

సంక్షేమ పథకాలను అందించాలి



సంక్షేమ పథకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలి. సంక్షేమ పథకాల కోసం పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి.

– కొలిప్యాక ఉపేంద్ర, ఎంపీపీ, ఏర్గట్ల

క్లుప్తంగా

విధి నిర్వహణను అశ్రద్ధ చేయొద్దు

- డీపీవో తరుణ్‌ జోషి



రుద్రూర్‌: విధి నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని డీపీవో తరుణ్‌ జోషి హెచ్చరించారు. రుద్రూర్‌ మండలం చిక్కడపల్లి, కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్‌ పంచాయతీలను మంగళవారం తనిఖీ చేశారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌ యార్డులను పరిశీలించారు. చిక్కడపల్లిలో పశువుల తొట్టి అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎక్లాస్‌పూర్‌ విలేజ్‌ పార్కులో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ, డంపింగ్‌ యార్డుకు సరైన రోడ్డు లేకపోవడం, జీపీ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని కార్యదర్శిని హెచ్చరించారు. అనంతరం కోటగిరి మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం రుద్రూర్‌, కోటగిరి జీపీ కార్యాదర్శులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో డీపీవో మాట్లాడా రు. నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని సూచించారు. వైకుంఠధామంలో విద్యుత్‌, నీరు, టాయ్‌లెట్స్‌ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి మనోహర్‌ రెడ్డి, బోధన్‌ డివిజనల్‌ పంచాయతీ అధికారి సాయిబాబా, కోటగిరి, రుద్రూర్‌ మండలాల జీపీ అధికారులు మారుతి, సాయిలు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు మీడియా అకాడమీ చైర్మన్‌

నిజామాబాద్‌నాగారం: టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం – మీడియా' అనే అంశంపై గురువారం జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను యూనియన్‌ నాయకులు మంగళవారం నిజామాబాద్‌ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. సదస్సుకు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌ కె.శ్రీనివాస్‌ రెడ్డి, రచయిత డాక్టర్‌ నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌ గౌడ్‌, ఎమ్మెల్యేలు సుదర్శన్‌ రెడ్డి, ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నగునూరి శేఖర్‌, విరహత్‌ అలీ హాజరవుతారని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్‌ తెలిపారు.

నిధులు రాక పనులకు బ్రేక్‌

- జిల్లాలో 44 సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు
- బిల్లులు రాక అర్ధంతరంగా నిలిచిన పనులు
- కొన్ని చోట్ల ప్రారంభం కాని వైనం



ఆంధ్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న సబ్‌సెంటర్‌

నందిపేట్‌(ఆర్మూర్‌): గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గాను జిల్లాలో కొత్తగా సబ్‌సెంటర్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చారు. జిల్లా వ్యాప్తంగా 44 ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం కోసం ఏడాది క్రితం రూ. 8.80 కోట్ల నిధులను కేటాయించింది. కాగా నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. నిజామాబాద్‌ జిల్లాలో ఒక్కో సబ్‌సెంటర్‌ నిర్మాణానికి రూ. 20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ ద్వారా మొత్తం 44 సబ్‌సెంటర్లకు గాను రూ. 8.80 కోట్లు నిధులు విడుదల చేశారు. సబ్‌సెంటర్ల నిర్మాణాలు ప్రారంభమై ఏడాది గడుస్తోంది. నిబంధనలు ప్రకారం పనులు జరిగే కొద్ది బిల్లులు విడుదల చేయాలి. కానీ 60 శాతం పనులు పూర్తిచేసినా బిల్లులు రావడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం పంచాయతీ రాజ్‌ శాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అయినా బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తిచేయడానికి ముందుకు రావడం లేదు.

బిల్లులు ఇప్పించేందుకు కృషి

జిల్లాలో చాలాచోట్ల సబ్‌సెంటర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోంది. వారికి బిల్లులు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నాం. పనులు ఆగకుండా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు చెబుతున్నాం.

– భావన్న, ఈఈ, పంచాయతీ రాజ్‌

ఆర్టీవో తనిఖీలతో వ్యాపారుల్లో గుబులు..

- సరైన పత్రాలు లేకుండానే ఇసుక వాహనాలను తిప్పుతున్న వ్యాపారులు
- నుంకెట్‌ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్‌
- ఒక్కో వాహనానికి రూ. 80వేల వరకు జరిమానా

మోర్తాడ్‌(బాల్కొండ): సరైన పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఇటీవల ఆర్మూర్‌ ఆర్టీవో పట్టుకోవడం వ్యాపారుల్లో గుబులు రేపుతోంది. ఇన్ని రోజుల పాటు సరైన పత్రాలు లేని, వ్యవసాయ ట్రాక్టర్లను ఇసుక తరలింపు కోసం యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. రెండు మూడు రోజుల క్రితం ఆర్టీవో దాడులు చేసి ఎనిమిది ట్రాక్టర్లను సీజ్‌ చేసి.. ఒక్కో దానికి రూ. 80 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ట్రాక్టర్లను వినియోగించేందుకు వ్యాపారులు జంకుతున్నారు. అయితే ఇసుకను వాగుల నుంచి తరలించడానికి వాహనాల యజమానులు వాటి పత్రాలతో తహసీల్దార్‌ కార్యాలయంలో వివరాలను నమోదు చేయించాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారులు అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాతే ఇసుక తరలించడానికి ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అధికారులు అవేమీ పట్టించుకోకుండానే ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వడం సందేహాలకు తావిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా..

వ్యవసాయం కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కొందరు వ్యాపారులు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ వ్యాపారులు అధికారులకు ముడుపులిచ్చి తమ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లకు తక్కువ పన్ను ఉంటుంది. వాణిజ్యానికి వినియోగించే ట్రాక్టర్లకు టాక్స్‌ ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అంతే కాకుండా ఇసుకను తరలించే ట్రాక్టర్లను కమర్షియల్‌ వాడకం కోసం వినియోగించాలంటే అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా వ్యాపారులు వ్యవసాయ ట్రాక్టర్లను వినియోగిస్తుండడం గమనార్హం.

అనుమతి పత్రాలు తప్పనిసరి

ఇసుకను తరలించే ట్రాక్టర్లకు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాణిజ్య అనుమతులు పొందిన ట్రాక్టర్లలోనే ఇసుకను తరలించాలి. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు.

– వివేకానంద రెడ్డి, ఆర్టీవో, ఆర్మూర్‌

జిల్లాలో రంజీ మ్యాచ్‌లు ఆడించేందుకు కృషి

- క్రికెట్‌ మైదానాన్ని అభివృద్ధి చేస్తాం
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో రానున్న రోజుల్లో హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రంజీ మ్యాచ్‌లు ఆడించడానికి కృషి చేస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అన్నారు. జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జీజీ కళాశాలలో జరుగుతున్న క్రికెట్‌ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమొంలో ఆయన మాట్లాడారు. మొదటిసారి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో క్రీడాకారుల కోసం శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తూ కీర్తి ప్రతిష్టలు తెచ్చారని తెలిపారు. నగర శివారులో క్రికెట్‌ స్టేడియం కోసం ఆరెకరాల స్థలం ఉందని, అవసరమైతే మరో నాలుగు ఎకరాల భూమిని సేకరిస్తామని చెప్పారు. అన్ని సదుపాయాలతో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే వేసవి నుంచి క్రికెట్‌ స్టేడియంలో టోర్నీలు, శిబిరాలు నిర్వహించుకుందామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రంజీ మ్యాచ్‌లు ఆడించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ రాష్ట్ర కార్యదర్శి దేవరాజ్‌, కోశాధికారి శ్రీనివాస్‌, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌, జాయింట్‌ కార్యదర్శి సురేష్‌బాబు, ఫారస్‌, వినోద్‌, నయీమ్‌, లలిత్‌రెడ్డి, సూరజ్‌, నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కామారెడ్డి– ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్‌ మండలం సురాయిపల్లి తండాకు చెందిన రమావత్‌ మోహన్‌ కామారెడ్డి నుంచి సురాయిపల్లికి తన బైక్‌పై వెళ్తుండగా.. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్తుంది. ఈ క్రమంలో గ్యాస్‌గోదాం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న బస్సు, బైక్‌ ఢీకొన్నాయి. ఘటనలో బైకు నడుపుతున్న మోహన్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మోహన్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 397 మంది గైర్హాజరు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం డిగ్రీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు, 1, 3, 5 సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జరిగినట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి నిజామాబాద్‌లో గల 38 కేంద్రాల్లో జరిగిన డిగ్రీ రెగ్యులర్‌ పరీక్షలకు 8,931 మంది అభ్యర్థులకు గాను 8,534 మంది హాజరు కాగా 397 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 386 అభ్యర్థులకు గాను 354 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్న వివిధ రూట్లలో నాలుగు ప్రత్యేక స్క్వాడ్‌ బృందాలు తనిఖీలు నిర్వహించారు. తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి, ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌, జాయింట్‌ డైరెక్టర్‌ అతీక్‌ సుల్తాన్‌ ఘోరీలు నిజామాబాద్‌, కామారెడ్డిలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని చీఫ్‌ సూపరింటెండెంట్లకు, ఇన్విజిలేటర్లకు సూచించారు.

బీడీ టేకేదార్ల కమీషన్‌ పెంపు చర్చలు విఫలం



బీడీ యాజమాన్యాలతో చర్చిస్తున్న టేకేదార్లు

ఖలీల్‌వాడి: బీడీ టేకేదార్లతో కమీషన్‌ పెంపు కోసం నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో బీడీ యూనియన్‌ నాయకులు, టేక్‌దార్లతో యాజమాన్యాల అసోసియేషన్‌ అధ్యక్షులతో సోమవారం రాత్రి చర్చలు జరిగాయి. చర్చల్లో యాజమాన్యాల అధ్యక్షులు టేకేదార్లకు రూ. 4 కమీషన్‌ పెంచుతామని.. అంతకంటే ఎక్కువ తమతో కాదని చెప్పి వెళ్లిపోయారు. టేకేదార్లు ఇందుకు ఒప్పుకోకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. బీడీ యాజమాన్యాలు 10 రోజుల వరకు వాయిదా తీసుకున్నారు. టేకేదార్లు యూనియన్లకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో బీడీ యూనియన్‌ నాయకులు, బీడీ టేకేదార్లు పాల్గొన్నారు.

కరెంట్‌ షాక్‌తో ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని సారంగాపూర్‌లో గల లిమ్రా ఎంటర్‌ప్రైజెస్‌లో పని చేస్తున్న సల్మాన్‌ ఖాన్‌(27) కరెంట్‌ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యువకుడు సల్మాన్‌ ఖాన్‌ మూడేళ్లుగా లిమ్రా ఎంటర్‌ప్రైజెస్‌ కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు యథావిధిగా పనుల కోసం కరెంట్‌ స్టార్ట్‌ చేయగా కరెంట్‌ షాక్‌ తగిలి మృతి చెందాడు.

మృతుడి తండ్రి రషీద్‌ ఖాన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

బ్యాంక్‌ లింకేజీ లక్ష్యం రూ.1,032 కోట్లు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్‌

డిచ్‌పల్లి: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంక్‌ లింకేజీ రుణలక్ష్యం రూ. 1032 కోట్లు పూర్తి చేయడానికి సమష్టిగా పనిచేయాలని డీఆర్‌డీవో సాయగౌడ్‌ సూచించారు. మంగళవారం డిచ్‌పల్లిలోని టీటీడీసీలో ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది లక్ష్యాన్ని పూర్తిచేసిన సిబ్బందిని అభినందించారు. ప్రస్తుతం సంవత్సరం లక్ష్యాన్ని పూర్తిచేయడానికి సిబ్బంది కృషిచేయాలని సూచించారు. గతేడాదిలాగే మే నెల 23 నుంచి 28 వరకు ఆడిట్‌ పూర్తిచేసి జూలై 4వరకు నివేదిక అందజేయాలని సూచించారు. వన్‌–టీ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలన్నింటిలో ముందంజలో ఉంటూ లోకోస్‌ అప్రూవల్స్‌లో జిల్లా మహిళా సంఘాలు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. ఎస్‌హెచ్‌జీలు, వీవోఎస్‌లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో సకాలంలో పొందుపర్చాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫాంలను అందించేందుకు కీలక బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. కుట్టుమిషన్‌ అనుభవం గల మహిళాలకు యూనిఫాంలు కుట్టడం, కటింగ్‌పై శిక్షణ ఇచ్చి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీఆర్‌డీవో రవీందర్‌, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్‌

డెంగీతో బాలుడు మృతి



ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): డెంగీ బారిన పడి చికిత్స పొందుతూ మణిదీప్‌(10) అనే బాలుడు మంగళవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మణిదీప్‌ 15 రోజుల క్రితం డెంగీతో హైదరాబాద్‌లోని కిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ. 17 లక్షలు ఖర్చయినా బాలుడి ప్రాణాలు దక్కలేదని మృతుడి తల్లిదండ్రులు కృష్ణ, పద్మ బోరున విలపించారు. బాలుడి మరణం స్థానికులను కలిచి వేసింది.

చిక్లీలో కేబుల్‌ వైర్లు చోరీ



మాక్లూర్‌: మండలంలోని చిక్లిలో సోమవారం రాత్రి వ్యవసాయ మోటార్లకు సంబంధించి కేబుల్‌ వైర్లతో పాటు జీపీ మోటారు కేబుల్‌ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒకే రోజు రాత్రి రైతులకు సంబంధించి 15 వ్యవసాయ మోటార్ల కేబుల్‌ వైర్లను కట్‌ చేసి అపహరించారు. పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

ధర్పల్లి: మండలంలోని కేశారంలో మంగళవారం సాయంత్రం 16 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నారు. ఎస్సై విక్రమ్‌ దాడిచేసి అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యంను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కిష్టయ్య మృతదేహం

పిట్లం(జుక్కల్‌): మండలంలోని చిన్నకొడప్‌గల్‌ శివారులోని జాతీయ రహదారి పక్కన బారడి పోచమ్మ ఆలయం వెనక ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకొడప్‌గల్‌కు చెందిన కిష్టయ్య(40) మృతదేహం ఆలయం వెనుక అటవీ ప్రాంతంలో మంగళవారం కనిపించింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి అన్న కొడుకు చంద్రశేఖర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కిష్టయ్య భార్య రుక్మిణి బండారాయితో కొట్టి చంపిందని అనుమానం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీరేశ్‌ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



గైని తుకారాం(ఫైల్‌)

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం అల్లాపూర్‌కు చెందిన గైని తుకారాం(30) ఓ హోటల్‌లో వంట మాస్టర్‌ పనిచేసేవాడు. ఇటీవల పెదకొడప్‌గల్‌లో స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి గైని సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

ఖలీల్‌వాడి: జీవితంపై విరక్తి చెంది ఒకరు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. రెండో టౌన్‌ ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోటగల్లికి చెందిన లింబాద్రి(50)కి మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదం జరగడంతో రెండు కాళ్లు కోల్పోయాడు. దీంతో మానసిక క్షోభకు గురై.. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో యువకుడు..

ఖలీల్‌వాడి: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అరుంధతీ నగర్‌కు చెందిన ప్రమోద్‌ కుమార్‌(24) పేయింటర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఒక యువతిని ప్రేమించాడు. అయితే ఆమె పెళ్లికి నిరాకరించడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రాజలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళ్లరాంపూర్‌లో గంజాయి కలకలం

- పట్టుబడిన హైదరాబాద్‌కు చెందిన యువకులు
- నిర్మల్‌ నుంచి కొనుగోలు
- యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



యువకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మోర్తాడ్‌(బాల్కొండ): ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో గంజాయి కలకలం సృష్టించింది. హైదరాబాద్‌ నుంచి కొందరు యువకులు ఉప్లూర్‌లో ఒక శుభకార్యానికి హాజరు కావడానికి వచ్చారు. కాగా మంగళవారం తాళ్లరాంపూర్‌లో కల్లు తాగడానికి వెళ్లారు. వారిలో కొందరికి గంజాయి అలవాటు ఉండడంతో నిర్మల్‌కు వెళ్లి కొనుగోలు చేసుకుని వచ్చినట్లు సమాచారం. గంజాయి సేవిస్తూ ఈత వనంలోనే జల్సా చేస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించడంతో స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు తనిఖీ చేయగా యువకుల వద్ద గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిసింది. యువకులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. గంజాయి విక్రేతలు, ఇతరుల వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఏర్గట్ల పోలీసులను 'సాక్షి' సంప్రదించగా గంజాయితో యువకులు పట్టుబడిన మాట వాస్తవమేనని విచారణ ఇంకా పూర్తి కాలేదని తెలిపారు.

బోర్లం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బాన్సువాడ రూరల్‌: మండలంలోని బోర్లం చెరువులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. చెరువులో నీలిరంగు షర్టు, నల్ల ప్యాంటుతో మృతదేహం కనబడడంతో గ్రామస్తులు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మున్నూర్‌ కృష్ణ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్‌ పరిధిలోని గౌతంనగర్‌కు చెందిన మొగర్తి గంగవ్వ(75) అదృశ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. పింఛన్‌ డబ్బుల కోసం గంగవ్వ మంగళవారం ఉదయం బ్యాంక్‌ ఖాతా, ఆధార్‌ కార్డు తీసుకొని బయటకు వెళ్లింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కోడలు గంగామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుర్నాపల్లిలో బాలికపై కుక్కల దాడి

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని కుర్నాపల్లికి చెందిన బాలికపై కుక్కలు దాడి చేశాయి. మంగళవారం శృతి(12) చెత్త పారబోసేందుకు వెళ్లింది. అక్కడ గుమిగూడిన కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్లు కుక్కలను తరిమేశారు. వెంటనే బాలికను చికిత్స నిమిత్తం ఎడపల్లి పీహెచ్‌సీకి తరలించారు.